క్లుప్తంగా

ఏఎంజేలో దివ్యాంగుల దినోత్సవం

గుంటూరు రూరల్: విభిన్న ప్రతిభావంతులుగా ఉన్న ప్రతి ఒక్కరూ అన్ని రంగాల్లో రాణించాలని విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ తెలిపారు. శనివారం నల్లపాడు గ్రామంలోని జేఎంజే సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఏదో టాలెంట్ ఉంటుందని, దానిని వెలికి తీసి ఉన్నత శిఖరాలను చేరేందుకు శక్తి వంచన లేకుండా కృషిచేయాలన్నారు. జేఎంజే సంస్థ డైరెక్టర్ సిస్టర్ మేరికుమారి ఆధ్వర్యంలో దివ్యాంగులకు ట్రై సైకిల్స్, వీల్‌చైర్స్, బస్ పాస్‌లు, బ్లైండ్ స్టిక్స్, సదరన్ సర్టిఫికెట్‌లను 89 మందికి అందజేశారు. సీబీఆర్ వర్కర్స్ కె.నాగేశ్వరరావు, బి.సాగరిక, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చేబ్రోలు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండల కేంద్రమైన చేబ్రోలులోని డాన్‌బాస్కో స్కూల్ సమీపంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చేబ్రోలు నుంచి నారాకోడూరు వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ప్రమాదవశాత్తూ కారు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో పాతగుంటూరు ప్రాంతానికి చెందిన ఎ.రాఘవ, చేబ్రోలుకు చెందిన ప్రసాద్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. కాళ్లు విరిగిన ఇద్దరిని చేబ్రోలు, వట్టిచెరుకూరు 108 వాహనాల ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్యకర్త కుటుంబానికి రూ.50వేలు ఆర్థిక సాయం

గుంటూరు రూరల్: ప్రతి కార్యకర్తకు వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పార్టీ నల్లపాడు డివిజన్ కన్వీనర్ దుగ్గెంపూడి యోగేశ్వర్ రెడ్డి తెలిపారు. శనివారం డివిజన్ పరిధిలో వైఎస్సార్ సీపీలో కీలకంగా కృషిచేసిన కార్యకర్త శానం శశి(32) వలంటీర్‌గా పనిచేస్తూ బ్రెయిన్ స్ట్రోక్‌తో ఇటీవల మృత్యువాతకు గురయ్యాడు. అదేవిధంగా అతని భార్య ప్రసన్న క్యాన్సర్ వ్యాధితో గతంలో మృతి చెందింది. వీరికి ఇరువురు చిన్నారులున్నారు. తల్లీ, తండ్రిని కోల్పోయిన చిన్నారుల భవిష్యత్తుకోసం కార్యకర్త కుటుంబానికి తనవంతుగా డివిజన్ కన్వీనర్‌గా రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశానని తెలిపారు. మాజీ సర్పంచ్ నడవ వీరయ్య, చిన్నప్ప, అమరేశ్వరరావు, నాగరాజు, భాస్కర్, గోపి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ జీర్ణోద్ధరణ పనులు

ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలోని మూడు వందల ఏళ్ల నాటి వేణుగోపాలస్వామి ఆలయం ధ్వజస్తంభం శిథిలావస్థకు చేరింది. దీంతో గ్రామానికి చెందిన డి.ప్రభాకర్‌రావు, భువనేశ్వరి దంపతులు నూతన ధ్వజస్తంభం ఏర్పాటుకు విరాళం అందజేశారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఈవో గాదె రామిరెడ్డి, ఆలయ ధర్మకర్త లక్ష్మారెడ్డిలు నూతన ధ్వజాన్ని రేపల్లె ప్రాంతం నుంచి గ్రామానికి తీసుకువచ్చారు. కొద్ది రోజులుగా పనివారు దానిని చెక్కుతున్నట్లు ఈఓ రామిరెడ్డి శనివారం తెలిపారు. పనులు పూర్తి అయిన తర్వాత నూతన ధ్వజస్తంభాన్ని వైఖానస శాస్త్రయుక్తంగా ప్రతిష్ఠ చేయనున్నట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పట్నంబజారు: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన సంఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా పెదకూరపాడు గ్రామానికి చెందిన కంచర్ల విజయబాబు (40) ఈనెల 10న ఇంట్లో వారితో పురుగు మందులు తీసుకొస్తానని చెప్పి గుంటూరు వచ్చాడు. 11వ తేదీ ఉదయం గుంటూరువారితోటలోని మాధవి రెసిడెన్సిలో రూము తీసుకుని ఉన్నాడు. 12వ తేదీ సాయంత్రం అయినప్పటికీ తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన లాడ్జి నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. తలుపులు పగులగొట్టి లోపలకు వెళ్లి చూడగా విజయబాబు కిందపడి మృతిచెంది ఉన్నాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతుడి భార్య ప్రమీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీరాముని అక్షింతలు పంపిణీ



తెనాలిటౌన్: ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముని మందిరం ప్రారంభం సందర్భంగా ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు శనివారం పట్టణంలోని గాంధీనగర్‌లో శ్రీరాముని అక్షింతలు పంపిణీ చేశారు. జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ ఇంటింటికీ వెళ్లి అక్షింతలు మహిళలకు అందజేశారు. శ్రీరాముని చిత్రపటంతో పాటు విగ్రహ ప్రతిష్ఠ ఆహ్వాన పత్రికలను అందజేస్తున్నారు. అయోధ్యలో జరిగే రామమందిర ప్రారంభోత్సవ కార్యక్రమానికి తరలి రావాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు శ్రీనివాసరావు,హరికృష్ణ, సాంబశివరావు, రఘురామయ్య, సీతారామయ్య, ఎస్వీ యోగ కన్వీనర్ ఎం.రమణయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ ధ్యేయం



కల్యాణమండపం మొదటి అంతస్తు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- చేబ్రోలులో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిలారి

చేబ్రోలు: ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులోని గాలిగోపురం ప్రాంతంలో రూ.30లక్షల వ్యయంతో నిర్మించనున్న కల్యాణ మండపం మొదటి అంతస్తు నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం జరిగింది. అదేవిధంగా స్థానిక జీబీసీ రోడ్డులోని బస్టాండ్ సెంటర్‌లో రవీంద్రనాథ్ స్వచ్ఛంద సంక్షేమ సేవా సంఘం రూ.14 లక్షల వ్యయంతో నిర్మించిన సులభ్ కాంప్లెక్స్ భవనం ప్రారంభోత్సంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయాచోట్ల జరిగిన కార్యక్రమాల్లో శాసనసభ్యుడు కిలారి మాట్లాడుతూ కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్నట్లు తెలిపారు. పరిపాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఏపీని ఆదర్శంగా నిలిపారన్నారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజల వద్దకే చేర్చినట్లు వివరించారు. 25వేల జనాభా కలిగిన చేబ్రోలు మేజర్ గ్రామ పంచాయతీలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఐదు గ్రామ సచివాలయాలు, ఐదు రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఇప్పటికే ఐదు ప్రాంతాల్లో భవనాల నిర్మాణాలు పూర్తి అయ్యాయని, మిగిలిన భవనాలను త్వరతగతిన పూర్తి చేయటం జరుగుతుందన్నారు. గతంలో పెన్షన్ల కోసం రోజుల తరబడి పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు పడాల్సి వచ్చేదన్నారు. జగనన్న వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే అవ్వాతాతలు, దివ్యాంగులు తదితరులకు వైఎస్సార్ పెన్షన్ కానుకను ఒకటవ తేదీనే పంపుతున్నట్లు తెలిపారు. చారిత్రాత్మకంగా ప్రసిద్ధి చెందిన చేబ్రోలులోని దేవాలయాల ప్రాంగణం వద్ద నిర్మించిన కమ్యూనిటీ హాలు పైభాగంలో మొదటి అంతస్తు నిర్మాణం పూర్తి చేసి కల్యాణ మండపంగా ఉపయోగిస్తే పంచాయతీకి ఆదాయవనరులుగా ఉంటుందన్నారు. జీబీసీ రహదారి ప్రాంతంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం ద్వారా రాకపోకలు సాగించే వారికి పబ్లిక్ టాయిలెట్స్ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గ్రామ సర్పంచ్ అత్తోట వినీతారాణి, వైస్ ఎంపీపీ పసుపులేటి శ్రీనివాసరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, ఉపసర్పంచ్ చౌడయ్య, కొక్కిలగడ్డ కిరణ్‌కుమార్, కాసు ఈశ్వరరెడ్డి, ఆదాం, బి.విజయకుమార్, గాదె కేశవరెడ్డి, పచ్చిగళ్ల సుబ్బారావు, పుల్లారెడ్డి, కోటేశ్వరరావు, మాణిక్యం, సూరిబాబు, జొలీ, గమనీడు నాగేంద్రుడు, సులభ్ కాంప్లెక్స్ కాంట్రాక్టర్ బుక్కిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొమ్మమూరు చానల్‌పై బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలన

చేబ్రోలు: మండల కేంద్రమైన చేబ్రోలులోని కొమ్మమూరు చానల్‌పై సుమారు రూ.42కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను శనివారం శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య పరిశీలించారు. ప్రస్తుతం చానల్‌కు ఇరువైపుల పిల్లర్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొమ్మమూరు బ్రిడ్జిపై నుంచి రేపల్లె, బాపట్ల, చీరాల, పొన్నూరు, గుంటూరు ప్రాంతాలకు రాకపోకలు సాగించటానికి ఇదే ప్రధానమైన రహదారి మార్గమన్నారు. దీనిని గత ప్రభుత్వం మాటలకే పరిమితం చేసిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రాధాన్యతను వివరించటంతో వెంటనే నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. పొన్నూరు పట్టణంలో జీబీసీ రహదారి విస్తరణ పనులు, ఉప్పలపాడు, తక్కెళ్లపాడు గ్రామాలకు తాగునీరు, కొమ్మమూరు చానల్‌పై బ్రిడ్జి నిర్మాణం, పొన్నూరులో ఆటోనగర్ తదితర పనులు జరుగుతున్నాయన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సంక్రాంతి షటిల్ పోటీలు ప్రారంభం

గుంటూరు రూరల్: పండుగలు మన సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు తెలియజేస్తాయని రూరల్ మండలం ఎంపీపీ ఇంటూరి పద్మావతి తెలిపారు. నల్లపాడు చల్లావారిపాలెం గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా పుట్టలమ్మతల్లి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన క్రీడా పోటీలలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను శనివారం ఎంపీపీ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని నైపుణ్యాలు మెరుగు దిద్దుకునేందుకు క్రీడాకారులు కృషిచేయాలన్నారు. జిల్లాస్థాయిలో క్రీడాపోటీలను నిర్వహిస్తున్న ఆలయ కమిటీని అభినందించారు. మొత్తం 50 జట్లు పాల్గొన్న షటిల్ డబుల్స్ పోటీలలో మొదటి బహుమతి గుంటూరుకు చెందిన విజయసాయిరెడ్డి, చంద్రగోపినాథ్‌లు సాధించగా, ద్వితీయ బహుమతి విజయవాడకు చెందిన పోతురాజు యువలు కై వశం చేసుకున్నారు. విజయవాడకు చెందిన ధనుష్, పృథ్వీరాజ్‌లు తృతీయ బహుమతి, నల్లపాడుకు చెందిన సాయి, అబ్బాస్‌లు చతుర్ధ బహుమతి సాధించారు. విజేతలకు 15వ తేదీన ఆలయం ప్రాంగణంలో జరిగే ఉత్సవాల్లో బహుమతులు అందజేస్తామని ఆలయ కమిటీ చైర్మన్ ఇంటూరి అంజిరెడ్డి తెలిపారు.

పుట్టలమ్మతల్లి బంగారు జడ ఊరేగింపు



అమ్మవారి బంగారుజడతో ఊరేగింపు నిర్వహిస్తున్న చల్లా పార్థురెడ్డి, అనూరాధ దంపతులు

గుంటూరు రూరల్: నల్లపాడు చల్లావారిపాలెం గ్రామంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఐదు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. గత ఏడాది సంక్రాంతి ఉత్సవాల్లో అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలందుకున్న అమ్మవారి ప్రసాదం లడ్డును నల్లపాడు గ్రామానికి చెందిన చల్లా పార్థురెడ్డి, అనురాధ దంపతులు రూ 12.40 లక్షలకు వేలంలో కైవశం చేసుకున్నారు. అమ్మవారి ప్రసాదం లడ్డూ అందుకున్న పార్థురెడ్డి దంపతులు అమ్మవారికి బంగారు జడను తయారు చేయించి, ప్రత్యేక ఊరేగింపుగా ఆలయానికి అందజేశారు. ఊరేగింపు ఆసాంతం ఆలయ కమిటీ చైర్మన్ ఇంటూరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో కోలాటాలు, కర్రసాములు, తీన్‌మార్ డప్పులు, దేవతామూర్తుల వేషధారణలతో సాగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ 14వ తేదీ ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. అమ్మవారికి ప్రత్యేకంగా కుంకుమార్చన జరుగుతుందన్నారు. సాయంత్రం కార్యక్రమాల్లో లక్ష్మీతిరుపతమ్మతల్లి కోలాట బృందం కోలాటం, మాస్టర్ మునగా సాంబశివరావు కేరళ వాయిద్యాలు, తమిళనాడు మహిళల డప్పుల వాయిద్యాలు, కర్నాటక మహిళల డోలు వాయిద్యాలు, అమ్మవారి వేషధారణలతో అమ్మవారి ఉత్సవమూర్తి భారీ ఊరేగింపు జరుగుతుందన్నారు. 8 గంటలకు భరతనాట్యం, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం



టాస్ వేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, మేయర్ కావటి

నెహ్రూనగర్: మానసిక ఒత్తిడిని తగ్గించించి శారీరక దృఢత్వం అందించడంలో క్రీడలు ప్రధాన పాత్ర పోషిస్తాయని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. శనివారం బీఆర్ స్టేడియంలో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను స్థానిక ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫాతో కలిసి టాస్ వేసి మేయర్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే బౌలింగ్ చేయగా, మేయర్ బాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రోజువారీ పనిలో ఎదురయ్యే మానసిక ఒత్తిడిని ఇష్టమైన ఆటలు ఆడడం ద్వారా అధిగమించవచ్చునన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడల ప్రాధాన్యతను గుర్తెరిగి ఆడుదాం ఆంధ్రా ద్వారా ప్రతి ఒక్కరిని క్రీడలలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేస్తున్నారన్నారు. నగర పాలక సంస్థ ఉద్యోగులు క్రీడలలో పాల్గొనడం శుభపరిణామం అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య వైద్య రంగాలతో పాటు క్రీడలకు కూడా అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఆడాలనే కోరిక, ప్రతిభ ఉన్నా ఆడుకోడానికి అవకాశం రానివారికి ఆడుదాం ఆంధ్రా మంచి వేదికగా నిలుస్తుందన్నారు. క్రీడలలో గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో మెలగాలని కోరారు.

సంబరాలతో నగరానికి సంక్రాంతి శోభ

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- సంక్రాంతి సంబరాల బ్రోచర్ ఆవిష్కరణ
- పాల్గొన్న ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాళి గిరి, మేయర్ కావటి, ప్రజాప్రతినిధులు



సంక్రాంతి సంబరాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజిని, మేయర్ కావటి, ఎమ్మెల్యేలు మద్దాలి గిరిధర్, ముస్తఫా

నెహ్రూనగర్: సంక్రాంతి పండుగ శోభను గుంటూరు నగరానికి నగరపాలక సంస్థ సంక్రాంతి సంబరాల ద్వారా తీసుకువస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. శనివారం ఎన్టీఆర్ స్టేడియంలో గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరగనున్న సంక్రాంతి సంబరాల బ్రోచర్‌ను మేయర్ కావటి శివ నాగమనోహర్ నాయుడు, పశ్చిమ, తూర్పు ఎమ్మెల్యేలు మద్దాలి గిరిధర్, షేక్ మొహమ్మద్ ముస్తఫా, అధికారులు, ప్రతినిధులతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ సంక్రాంతి అంటేనే తెలుగు ప్రజలకు అత్యంత ముఖ్యమైన పండుగ అని, సంక్రాంతికి గ్రామీణ ప్రాంతాలలో జరిగే పండుగ శోభను నగరపాలక సంస్థ గుంటూరు నగర ప్రజలకు చేరువ చేసిందన్నారు. నగర ప్రజలు సంక్రాంతి సంబరాల్లో కుటుంబ సమేతంగా పాల్గొనాలన్నారు.

- మేయర్ మాట్లాడుతూ గత ఏడాది సంక్రాంతి సంబరాలను అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరుపుకొన్నామని, ఈ ఏడాది కూడా అన్ని వయస్సుల వారిని అలరించేలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు. నగరపాలక సంస్థ నుంచి కులమతాలకు అతీతంగా పవిత్ర రంజాన్, క్రిస్మస్ వేడుకలు ఐక్యంగా జరుపుతున్నామని, అలాగే సంక్రాంతి సంబరాలు కూడా ఉత్సాహభరితంగా సాంప్రదాయ క్రీడలు కళారూపాలు, సాంస్కతిక కార్యక్రమాలతో ప్రతి రోజు పండుగ వాతావరణం ఉంటుందన్నారు.
- ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ మాట్లాడుతూ, తెలుగువారి ప్రధాన పండగ సంక్రాంతి అని, అటువంటి పండగ సంబరాలను నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలో చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ పండగలను పట్టణ ప్రజలు మరిచిపోతున్నారని ఇటువంటి తరుణంలో జీఎంసీ సంక్రాంతి సంబరాలు చేపట్టడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.

నేటి నుంచి సంక్రాంతి సంబరాలు..

ఆదివారం భోగి సందర్భంగా ఉదయం 7గంటల నుంచి సంప్రదాయమైన సన్నాయి వాయిద్యాలతో స్వాగతం, భోగి మంటలు గంగిరెద్దుల విన్యాసాలు, చిన్నపిల్లలకు భోగి పళ్లు పోయటం, సాయంత్రం 6 గంటల నుంచి జబర్దస్త్ కళాకారులతో వివిధ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి సినీ గాయని దామిని, మెలోడీ స్టార్ శ్రీకృష్ణ, ట్రిపుల్ ఆర్ ఫేం హారికా నారాయణ్, ఉమా నేహా, రవి జాకీ, డీటీఎస్ ఆనంద్ లచే స్టార్ మ్యూజికల్ మస్తి డాన్స్ హంగామా జరుగుతాయని నగర ప్రజలు ఈ సంబరాలలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

తెనాలిరూరల్: భార్య కాపురానికి రావడంలేదని భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన పొన్నాల సుబ్బారావు(34)కు స్థానిక పాండురంగపేటకు చెందిన శివపార్వతితో వివాహమైంది. భార్య కొంతకాలంగా కాపురానికి రావటం లేదు.దీంతో ఇరు కుటుంబాల వారు తరచూ గొడవపడుతుండేవారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి అత్తింటికి వచ్చిన సుబ్బారావు భార్యను కాపురానికి రమ్మని గొడవపడ్డాడు. కాపురానికి వచ్చేందుకు భార్య నిరాకరించడంతో అత్తింట్లోనే రాత్రికి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఉదయం సమాచారం అందుకున్న త్రీ టౌన్ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంబరంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల విజేతలతో ఎంపీపీ ఇంటూరి పద్మావతి, ఆలయ కమిటీ సభ్యులు

గుంటూరు రూరల్: నల్లపాడు చల్లావారిపాలెం గ్రామ ప్రజల ఇలవేల్పు పుట్టలమ్మతల్లి, ఘంటాలమ్మతల్లి కృపా కటాక్షాలు ప్రతి ఒక్కరికీ కలగాలని రూరల్ మండలం ఎంపీపీ ఇంటూరి పద్మావతి తెలిపారు. శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా జిల్లాస్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ ప్రజల ఇలవేల్పు అమ్మవారికి ఐదురోజుల ఉత్సవాలు జరపటం సంతోషకరమన్నారు. ముగ్గుల పోటీల్లో మొత్తం 70 మంది పాల్గొనగా మొదటి బహుమతి నాలుగు బర్నర్ల గ్యాస్ స్టవ్ గుంటూరుకు చెందిన ఆర్.గీతాంజలి కై వశం చేసుకున్నారు. ద్వితీయ బహుమతి త్రీజార్ మిక్సర్ గ్రైండర్ రేపల్లెకు చెందిన కె.మల్లేశ్వరి, తృతీయ బహుమతి గ్రైండర్ గుంటూరుకు చెందిన పద్మజ, నాలుగవ బహుమతి సత్తెనపల్లికి చెందిన పి.సుజాతలు కైవశం చేసుకున్నారు. ముగ్గుల పోటీలలో న్యాయ నిర్ణేతలుగా గుంటూరుకు చెందిన మల్లేశ్వరి, భాగ్యలక్ష్మి, సరస్వతి సత్తెనపల్లికి చెందిన ఆర్.సరస్వతిలు వ్యవహరించారు. విజేతలకు 15వ తేదీన ఆలయ ప్రాంగణంలో జరిగే వేడుకలో బహుమతులను అందజేస్తామని ఆలయ కమిటీ చైర్మన్ ఇంటూరి అంజిరెడ్డి తెలిపారు. అదేవిధంగా ముగ్గుల పోటీలలో పాల్గొన్న 8 మందికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. చక్కా శివకుమార్, గ్రంధి శంకరరావులు ముగ్గుల పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

నెక్ట్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవం



వివిధ పోటీల విజేతలతో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో చదివి సమాజాభివృద్ధికి కృషిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం గోరంట్ల గ్రామంలోని నెక్ట్స్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నైపుణ్యత, ప్రమాణాలతో విద్యార్థులకు విద్యను అందిస్తున్న స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. సీబీఎస్ఈ విజయవాడ రీజినల్ ఆఫీసర్ శేఖర్‌చంద్ర మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి ఎప్పటికప్పుడు నైపుణ్యాలు మెరుగు దిద్దుకునే దిశగా కృషిచేయాలన్నారు. పరివర్తన్, పంచతత్వ అనే థీమ్‌పై పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. సంస్థ డైరెక్టర్ కోగంటి శ్రీకాంత్‌బాబు, కోగంటి శ్రీవిద్య, కెన్నెడీ ఫౌండర్ కె.బేబీసావిత్రి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కొలసాని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సాంప్రదాయలను కాపాడుకోవాలి

రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న వై.వెంకటేశ్వరరావు

గుంటూరు రూరల్: మన సంస్కృతి, సాంప్రదాయాలకు పండుగలు నిలువుటద్దాలని మన సంస్కృతి సాంప్రదాయాలను మనమే కాపాడుకోవాలని రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతునేస్తం ఫౌండేషన్‌లో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ తెలుగువారికి పెద్ద పండుగని తెలిపారు. మన సంస్కృతిలో వ్యవసాయం ప్రధాన భూమికను పోషిస్తుందన్నారు. రైతులు పండించిన పంటలు ఇంటికి చేరి రైతు సంతోషంగా జరుపుకొనే పండుగ సంక్రాంతి అని తెలిపారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించారు. సాంప్రదాయ వంటలు అరిసెలు, చక్రాల వంటల పోటీలు నిర్వహించారు. నేరేళ్ల తిరుపతిరావు (చిన్న స్వాములు), నందిపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ దార్శనికత స్ఫూర్తిదాయకం



నేత్ర జ్యోతి వైద్య శిబిరంలో కళ్లజోళ్లు అందుకున్న వారితో అంబటి మురళీకృష్ణ

- సంక్షేమ పథకాలతో పేదరిక రహిత సమాజ స్థాపన
- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- బ్రాహ్మణకోడూరులో 519 మందికి కళ్లజోళ్లు పంపిణీ

కొరిటెపాడు(గుంటూరు): పేదరిక రహిత సమాజ స్థాపనకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టి, దార్శనికత స్ఫూర్తిదాయకమని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అన్నారు. పొన్నూరు మండలం బ్రాహ్మణకోడూరు గ్రామంలో ఈ నెల 7వ తేదీన బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా నిర్వహించిన నేత్ర జ్యోతి వైద్య శిబిరంలో కళ్లజోళ్లు అవసరమైన 519 మందికి వారి దృష్టి లోపం ఆధారంగా సిద్ధం చేసిన వ్యక్తిగత కళ్లజోళ్లను శనివారం బజరంగ్ ఫౌండేషన్ అధినేత అంబటి మురళీకృష్ణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి దృష్టి లోపం ఉన్నవారి సమస్యలకు కేవలం ఒక కళ్లజోడు పరిష్కారం ఇస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా సుదీర్ఘకాలం పాటు పేదరికం, వెనుకబాటు తనంతో మగ్గుతున్న వారికి జగనన్న సంక్షేమ పథకాలు ఊరట కలిగించి వారిని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాయన్నారు. గ్రామాల్లో ఆర్థిక స్తోమత లేని వెనుకబడిన వర్గాల ప్రజానీకానికి నేత్ర సమస్యల నుంచి ఉపశమనం కలిగించటానికి బజరంగ్ ఫౌండేషన్ నేత్రజ్యోతి కార్యక్రమం ద్వారా చిత్తశుద్ధితో శ్రమిస్తోందన్నారు. సేవా కార్యక్రమాలను పేదల ముంగిట్లోకి తీసుకువచ్చి ఎక్కడ ఉండేవారికి అక్కడే శిబిరాలను ఏర్పాటు చేసి నిపుణులైన వైద్యుల ద్వారా వైద్య పరీక్షలను జరిపిస్తున్నట్లు వెల్లడించారు. ఎవరి వ్యక్తిగత సమస్యను బట్టి వారికి వ్యక్తిగత కళ్లజోళ్లను ప్రత్యేకంగా తయారు చేయించి శిబిరం పూర్తి అయిన ఆరు పనిదినాల్లోనే వారికి కళ్లజోళ్లను అందించడం జరిగిందన్నారు. పొన్నూరు మండలంలోని బ్రాహ్మణకోడూరు గ్రామానికి చెందిన 519 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. బజరంగ్ ఫౌండేషన్ సామాజిక సేవా విభాగం బృంద సభ్యులు ఆద్యంతం ఈ పంపిణీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించడంలో కృషి చేశారని ఆయన వివరించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

తెనాలిరూరల్: పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. తెనాలి మండలం తేలప్రోలు శివారు డంపింగ్ యార్డు వద్ద పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో శనివారం సాయంత్రం ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1750లు, మూడు బైకులు స్వాధీనపరుచుకున్నారు.నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టాంగో సూడో క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

తెనాలిఅర్బన్: 10వ టాంగో సూడో నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో తెనాలిలోని కేఎస్ ఆర్ తైక్వాండో అకాడ మీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పోటీల్లో ఆరాధ్యుల చరణ్, షేక్ బాషా, పి బెన్ని రాజశేఖర్‌లు రజిత పతకాలు సాధించగా, టి సత్య జశ్వంత్, ఎన్ జ్ఞాన తేజలు క్యాంస పతకాలు సాధించినట్లు కోచ్ కె వెంకటేశ్వరరావు తెలిపారు.